కథానిక:

# పశ్చాత్తాపం లేదు

కమలమ్మ నన్ను మళ్లీ రెండు చీరలు కొని తీసుకురమ్మంది. క్రితం సారి కొన్న చీరలు తన స్నేహితులు ఎంతో బాగున్నా యన్నారట. ఎవళ్లు ఏ చీరలు ధరిస్తే బాగుంటారో నాకు బాగా తెల్సునంటుంది. చీరల నాజూకు, నాణ్యం, మన్నిక, బోర్డర్ల అమరిక నాకు తెలిసినంతగా మావాళ్ళల్లో ఎవ్వరికీ తెలియవుట. నిజానికి నాకు వాటివిషయం అంతగా తెలీదు. ఈకాస్తలో అతిశయం ఎందుకు? నాకు బొత్తిగా తెలియవని వొప్పేసుగుంటున్నాను. భారతంలో ధర్మరాజు ఏదో సందర్భంలో ధర్మమూర్తిగా పేరు పడ్డాడు — ఆ పేరు నిలబెట్టుకునేందుకు చాలా బాధపడినట్లుగా కనిపిస్తాడు. ఇతరులు మనల్ని పూర్తిగా అర్థం చేసుకోక పోవడంవల్ల కొన్ని బాధలు పడతాం. పూర్తిగా అర్థం చేసుకున్నట్లయితే యింకెంతటి చిక్కుల్లో పడతామో! కొందర్ని గురించి కొన్ని అభిప్రాయాలు స్థిరపడతాయి. వాటికి అనుగుణంగా ప్రవర్తించడానికి వారు చాలా యత్నాలు చేసి ఆ అభిప్రాయం తప్పుకాదని ఋజువు చేసేందుకు నటించడం మొదలు పెడతారనుకుంటాను—

కమలమ్మ నాకు చీరల విషయం బాగా తెలుసునన్నప్పట్నుంచి నేను చీరలకొట్లచుట్టూ తిరగడం తప్పిందికాదు. మహా కొనేవాడిలాగ లోపలికి వెళ్ళడం - రకరకాల చీరలు తీయించి చూడడం, ఏవి ఎవరికి బాగుంటాయో ఊహించుకోవడం - వాటి ధరలు, అవిఎక్కడెక్కడ తయారయ్యేదీ, తెలుసుకోవడం పరిపాటి అయిపోయింది. అప్పూళ్లో నాపని చూసుకొని కమలమ్మ చీరలకోసం కొట్లో ప్రవేశించేటప్పటికి సాయంత్రం నాలుగైంది. కొట్టువాడు రకరకాల చీరలను నా ముందు పరిచి వర్ణించడం మొదలు పెట్టాడు. ఓ పావుగంట పరామర్శించినా ఏ చీరలు బాగున్నాయో నేను నిర్ణయించలేకపోయాను.

అన్నీ బాగా నేవున్నై. ఎక్కువ ధరున్న చీర మరీ బాగున్నట్టు కనిపిస్తుంది - అదేం చిత్రమో ! వాటిని చూసినప్పుడు మన దేశంలో ఎంత గొప్ప పనివాళ్ళు వున్నారో వూహించడం - వెనక యింకా ఎంత గొప్ప పనివాళ్ళు వుండేవాళ్ళో. అగ్గిపెట్టెలోంచి చీరని విప్పి కట్టుకొన్న ముంతాజ్ బేగం, ఝాన్సీ లక్ష్మిబాయి, యింకా వెనక్కి వెళ్ళి.గార్గి, మండోదరి, దమయంతి, చీరల ప్రస్తావన వొచ్చినప్పుడు అందరికంటె ముఖ్యంగా స్మరణకొచ్చే ద్రౌపదీ మొదలగు సౌందర్యమూర్తులను వూహించుకోవడంలో ఆనందం వుంది. చీరల డిజైన్సును బట్టీ, అద్దకం అమరికను బట్టి వాటిని మొట్టమొదట సృష్టించిన పనివాడిని వూహించడం మరీ తమాషాగా వున్నా, అమ్మేవాడు 'యిదేమన్నా కొనే బాపతేనా' అన్నట్లు విసుగుతో కనుబొమ్మలు చిట్లించగానే మాఅమ్మమ్మ తయారుచేసిన బొంతలో గుడ్డ పేలికల మాదిరి వూహా దృశ్యం తుత్తునియలై పోతుంది. అంతపనీ జరిగింది. కొట్టువాడికి విసుగుపుట్టి మరోవ్యక్తికి చూపించటానికి అక్కడనుంచి వెళ్ళి పోయాడు. ముంతాజ్ బేగం,ఝాన్సీ లక్ష్మిబాయి, గార్గి, మండోదరి, దమయంతి, ద్రౌపదులు,'అది' 'ఇది' 'ఇదికాదది'అని వారభిరుచులను బట్టి చీరలను ఎన్నుకోవలసిందిగా చెపుతూనే వున్నారు. వాళ్ళకేం వాళ్ళు ఎన్నైనాచెప్తారు. వాళ్ళందరిది బంగారు ఛాయ. వాళ్ళు ఏ చీరధరించినా బాగానేవుంటారు. కమలమ్మది నల్లటి ఛాయ. అట్లాగంటే కోపంవస్తుంది,కాబట్టి చామనఛాయ అంటాను.అంచేత డాబుగా కొట్టొచ్చేటట్లు కనబడే దట్టమైన రంగుల చీరలను తోసేసి కొంచెం లేత రంగులవి బైటకి లాగాను. అటు, యిటూ చూశాను. ఎందరో మొగాళ్ళు, ఆడాళ్ళు కనుపించారు. ఆ గుంపులో అమ్మేవాడెవడో తెలియక అటూయిటూ చూసి తలపంకించి రమ్మన్నట్లుగా సంజ్ఞచేసి నట్లా ఆ చీరల దొంతరలోంచి ఒక చీర పైకి లాగి 'యిది బాగుందా?' అన్నాను, అప్రయత్నంగా పక్కనున్న వ్యక్తికేసి చూడకుండా.

" బాసికంలో ఆ సిమెంటు రంగుది బాగుంది." అంది ఆవ్యక్తి తాలూకుసొంతం. తప్పుడపడి మరిగి మూసేటప్పటికి ఆవ్యక్తి ఒక స్త్రీ. క్షమించమందామని లోపల అనుకున్నా. కాని, నాకంటె చిన్న వ్యక్తిని క్షమించమనడానికి మనసు ఒప్పుకోలేదు. ఆమె ఇరవై ఏండ్ల లోపుదిగా కనబడింది.

" లేకపోతే ఆ స్నఫ్ కలర్ది కూడా బాగుంది." అందిఆమె మళ్లా. ఆవిడ ఎన్నిన చీరని పాటితెయ్యడం కష్టం తోచింది. ఎందు కంటే కమలమ్మకి, స్నఫ్, సిమెంట్ కలర్లు బాగుండవు.

" ఇవి, కొంచం నల్లవాళ్ళకి బాగుంటాయంటారా?" అన్నాను.

" నాకంటె నలుపా?" అంది. ఆమెనలుపుకాదు, బాగా ఎరుపులో జత.

" అబ్బే - మీ కేం? - మీరు" ఎట్లాచెప్పాలో తెలీలేదు. నవ్వింది.

" చాలా నలుపు" అన్నా. నాకు నవ్వొచ్చింది.

" ఎవరికి యీ చీరలు?" అంది.

" కమలమ్మని — మా చుట్టం "...అన్నా.

ఆడమనిషి ఎంత సేపు బేరంచేసినా కొట్టువాడికి విసుగుండదు కాబోలు చక్కావొచ్చాడు. ఆమె చనువుగా మాట్లాడడం కొంచం ధైర్యం కలిగించింది.

"మీరు కట్టుకున్న చీర చాలా బాగుంది."అన్నా. అట్లాఅంటే స్త్రీలు తృప్తిపడతారని తెలుసు నాకు.

" ఇదా..." అని చీర కేసి చూసుకుంది.

" ఇది పట్నంలో కొనుక్కున్నా, పాతదైంది"

" అల్లాంటివి యిక్కడ లేవనుకుంటా ..." అంటూ ఏదో గొణిగాను.

తొందరగా తనకి కావాల్సిన చీరలు రెండు ఏరేసి బిల్లు తెమ్మంది.

"నాకు తేలడంలేదు. మీరు తేల్చండి మీకిల్లాంటివి బాగా తెలిసినట్టుగా తోస్తోంది" అన్నా. ఆమె గర్వంగా నవ్వింది.

"పోనీ. ఆ కమలమ్మనే కొట్లోకి తీసుకురాలేక పోయ్యారా!" అంది.

"కమలమ్మది యీవూరు కాదు."

"మీది?"

"వూరిదీ కాదుం..."

ఆఖరికి రెండుచీరలు, ఆవిడ ఏరిపెట్టింది. కమలమ్మకి కోపమొచ్చినా సరే ననుకుని, సిమెంట్ రంగుదికూడా ఏరాను. ఆమె మరింత గర్వంగా తన సమ్మతిని తెలియచేస్తూ, తల పంకించింది. చిల్లర తెచ్చేలోపల నేను అప్రయత్నంగా ఆమెకేసి చూడడం మొదలెట్టాను. అసలు నాకు స్త్రీలంటే చెడ్డసిగ్గు. అందులో పరాయిదంటే భయంకూడా.

కాని, ఆమెలో అమాయకత్వాన్నుండి జనించిన చనువు, "నాతో స్వేచ్ఛగా మాట్లాడొచ్చు" అని ఆహ్వానిస్తున్నట్లు కనపడే చురుకుతనం. విచక్షణచేసి విలువలు కట్టడానికి యింకా అలవాటు పడని యవ్వనం తాలూకు దగ్గరతనం—ఈరకం ఆకర్షణ ఆమెలో వుండడం మూలాన్న కాబోలు తబ్బిబ్బునుండి తేరుకొని సాఫీగా మాట్లాడ గల్గుతున్నాను. మాట్లాడిన కాస్సేపు యీమె చక్కనిదేనా అన్నప్రశ్న రాలేదు.

'జాకెట్టుగుడ్డలు చూడరూ?' అంది.

నాకు నవ్వొచ్చింది. ఆమె మెడకేసి చూశాను. రెండుమూడు గొలుసులు కనిపించాయి. ఎర్రరంగు చీరకొంగు మెడచుట్టూ లాగి కందువాలాగ వెనక్కి వేసుకుంది.

"మీ కిందులో ఏది బాగుంది?" అంది మరికొన్ని బట్టలు చూపించి.

జనం పల్చబడ్డారు.

అరగంట కొట్టింది కొట్లో గడియారం. నేను చీరలసంచి తీసుకుని, గుమ్మంలోకి రాగానే, చాలాసేపునుంచి కురవడం మొదలెట్టిన వర్షం పెద్దదైంది. ఆమెకూడా వొచ్చింది.

"వర్షంలో ఎట్లా వెళ్ళడం?"

నేనూ, అదే అనుకొంటున్నా. కొట్టువాడు సిద్ధంచేసిన కుర్చీ మీద కూర్చుంది.

"మరి మీకో !" అంది.

"ఫరవాలేదు" అన్నా.

"మీరేం చేస్తున్నారు?"

"నేనేమీ చెయ్యను. అప్పుడప్పుడు కథలు వ్రాస్తుంటాను."

ఆశ్చర్యంతో "నిజంగా ?" అంది కాని, అల్లాచెప్పినందుకు విచారించా. కథలనుగురించి కొత్తవాళ్ళతో. అందులో స్త్రీలతో విమర్శించడం నాకు విసుగు.

"నేనెప్పుడూ మీపేరు వినలేదే! అంటే, అసలు నేనెప్పుడూ చదవనులెండి...స్కూలు కథలు పాఠాలతోనే సరిపోతుంది"

బతికారా దేముడా అనుకున్నా.

"కథలంటే నవల్సా ?"

"బాగా పెద్ద కథ అయితే నవలంటారు"

నన్నుగురించి చాలా అడిగింది. తననిగురించి చాలా చెప్పింది. మా యిద్దరిలోనూ ఏమీ సమానంగా లేవు. మా తండ్రి వృత్తివేరు.

ఆమెకి తలితండ్రులు గతించారుట. అన్నగారు ప్లీడరుట. అన్నదగ్గిరే వుంటోంగట. వాళ్ళ తల్లినిగురించి చాలాసేపు చెప్పింది. సంభాషణ యింకా వ్యర్థంగా కనబడకుండానే వాన వెలిసింది. ఆమెలేచింది. నేనూ కదిలాను. అప్పుడో ప్రమాదకరమైన ప్రశ్న వేసింది.

'మీకు పెండ్లయిందా!''

"లేదు...'' రోడ్డుమీదికి చేరుకున్నాం.

పైట చల్లగావుంది. పశుల అరుపులో చలివల్ల వొణుకుతున్న వంకర్లు వినిపిస్తున్నాయి.

"మీకు?" అన్నా మెల్లిగా.

నాకు కాఫీ తాగాలనివుంది. అట్లా అనిచెప్పా. తనూ తాగుతానంది. నాకు మొదట్లో భయంతోచినా, చీకటివల్ల కొంత ధైర్యంచిక్కింది. మమ్మల్ని ఎవరుచూసినా ఫరవాలేదని. పైగా నాది పొరుగూరు.

హోటల్లో మూలగదిలో చేరుకున్నాం.

"మీ విషయం చెప్పారుకాదు" అన్నా ఇందాకటిప్రశ్నని రెట్టించి.

"లేదు, లేదు" అని తన భుజాల కేసి సిగ్గువల్లకాబోలు చూచుకొని నవ్వింది. నేను ఆమెతో మాట్లాడుతున్నా నా మనస్సు అక్కడ లేదు; ఎందులోనూ అంగీకరించని మేము వివాహం విషయంలో ఒకటయ్యాం. మా యిద్దరికీ పెండ్లిండ్లు కాలేదు. అదేగాలిలో మారంగా కనిపించే మా స్నేహభవనానికి పునాది.

తర్వాత యిద్దరం మౌనంలో పడ్డాం. యింక మాట్లాడేందుకు ఏమీ కనిపించలేదు.

"ఏవన్నా తీసుకుంటారా?''

" తీసుకున్నాంగా "

" ఏంతీసున్నాం?"

" చీరలు కదూ! "

" అబ్బే అదికాదు. ఏమన్నా పుచ్చుకుంటారా," అని.

" ఓ. అదా. పద్దు పద్దు నవ్వింది. అందమైన పళ్ళవరుస. ఎప్పుడూ నవ్వుతోవుంటుంది. టూత్ – పేస్టు ఎడ్వర్టైజ్ మెంటుకి జరిగే పోటీకి ఆమె నవ్వుతున్న ఫొటో పంపాలనుంటుంది.

' మరి మీరో?'

' నేనేమిటి? '

' ఏం పుచ్చుకోరు? '

' ఓ అదా. ' అని నవ్వుతూ జేబురుమాలు నాపళ్ళ కడ్డంగా పెట్టుకున్నాను. పళ్ల వరసలోంచి ఒకపన్ను కాస్త వెనక్కి వుంటుంది నాద, అందుకని మళ్ళానిశబ్దం. క్లీనర్ కప్పులు, ప్లేట్లులాక్కుపోతున్న ధ్వనులు. వాడు నల్లగా వున్నాడు. తలకేదో ఎర్రటిగుడ్డ. అజంతా చీకటిగుహాలో గోడమీద చిత్రంలో రాజుగారికాళ్ళకు, పీటగా వెన్నువంచి కూర్చున్న అకుర్రాడి చిత్రంలా.

నేనే బిల్లుచెల్లించా - బయటికినడిచాం. నడుస్తూ వెడుతున్నాం. అక్కడితో రోడ్డు రెండు పాయలగా చీలింది.

"మీరు లేకపోతే చీరల సెలక్షన్ యింత తొందరలో యింత తృప్తికరంగా అవకపోను" అన్నాను, ఏదో మాట్లాడాలికదా అని.

"నన్ను అండి ఎందుకంటారు - మీకంటె చిన్నదాన్నికదూ. అనకండి" అన్నదామె.

ఈచిన్నా, పెద్దా పట్టింపులు నలభై యేళ్ళపడిలో పడిన వాళ్ళకిగాని ఆమె కెందుకు. ఏళ్ళపట్టింపు పెట్టుకున్న వాళ్ళు, తమ పట్టింపు ముదిరినకొద్దీ యవ్వనానికి దూరమై పోతున్నారన్నమాటే!

పేరు చెప్పింది, 'కమల' అని.

"మా కమలమ్మదీ. మీదీ - కాదు కాదు - నాది - ఒకటే పేరే. చిత్రంగా లేదూ !" అన్నాను.

నాది ఫలానావూరు అని చెప్పాను.

"మాది మీవూరికి దగ్గరే" అంది. యిక్కడ కాలేజీలో చదువుకుంటోందిట సెలవులిచ్చారుట. వూరికెళ్ళేముందు, ఏవైనా చీరలు కొనుక్కెడదామని తనని ఫలానా కొట్లో వుంచమని తను కూడా వస్తానన్న స్నేహితురాలు ఎందువల్లనో రాలేదుట.

ఆమెకో తమ్ముడున్నాడుట. పట్నంలో కాలేజీలో చదువుకుంటున్నాడట. నానిక్కడా తమ్ముడక్కడ. విడివిడిగావుండి ఎందుకు చదువుకోడం అని అడగాలనిపించింది. కాని అవన్నీ నాకెందుకూ. ఎందుకూ అనుకుంటే అడగాలని ఎందుకనిపించింది? ఏమిటో నాకంతా గందరగోళంగా వుంది.

తనింటికి రమ్మనమంటుందేమోననుకున్నా. కాని, అల్లా అనలేదు.

"మీ వూళ్ళో మీయిల్లు ఎక్కడ ?"

మాఇల్లు ఎక్కడుండేది, ఎల్లావుండేదీ అంతా చెప్పాను.

"సరే. నే వెడతా...." అన్నాను. నాకేసి చిత్రంగా, జాలిగా చూసింది. తన హృదయంలో బాధా, కంఠంలో భాషా దిగమింగుకుని.

'కమలమ్మని అడిగానని చెప్పండి....' అని కదిలివెళ్ళిపోయింది.

నేనక్కడే నిలబడిపోయ్యాను ఆమెకేసి చూస్తూ. మధ్యలో రెండుమార్లు నావేపు తిరిగి చూసింది

జడ చీరలో కలిసి, రెంటూ చీకట్లోకలిసి, మెరిసి మెరిసి అంతర్ధానమైంది. అనుకోకుండా నానేత్రాలు తడిసినై. నాకు దిగులేసింది.

నాగొంటవ అర్థంకాక నరాలు దోవతప్పి తిరుగాడుతున్నాయి. నేనో అబద్ధం చెప్పాను, నాకు పెండ్లికాలేదని. ఆ ఏమీతెలీని అమాయకు రాలితో యీ అసత్యం చెప్పడంలో నావుద్దేశం నాకర్థంకాలేదు. మిగతా అన్ని విషయాలు నిజంచెప్పాను. ఎందుకు? సమయానికి నా తార్కిక జ్ఞానం, నాబుద్ధి, నోరుమూసుకుంది. నన్ను సంప్రతించ కుండానే, నా పంచేంద్రియాలు ఏకమై ఆ అబద్ధం నాచేత చెప్పిం చాయి, అంతే భాషయొక్క విలువ! నాకు నా భావాలమీద, శరీ రానికున్నంత అధికారం లేదన్నమాట : చిన్న బుచ్చుకున్నాను; నామీద నాకు కోపంవచ్చింది. అట్లా పెళ్ళి కాలేదంటే, ఆమె అసూయలేకుండా, నాతో స్వేచ్ఛగా మాట్లాడుతుందనా? నిజంచెప్పి ఆమెని వంచించలేననా? ఆమె నన్ను నిజంగాకోరి ప్రేమిస్తోందను కుంటే, నాకు భార్య వుంటేమాత్రం ప్రేమించడం మానుతుందా? మరెందుకు అబద్ధం?

లేక సంసారానికి, నేబానిసనని వొప్పుగోటానికి నాలో వ్యక్తి త్వం యిష్టపడక, తిరగబడి అసత్యం చెప్పించి వుండొచ్చు. బ్రహ్మ చారి స్వేచ్ఛని అనుభవిస్తున్నాడనుకుంటాడు. స్త్రీకి, అతనిలో కొత్త దనం, లోతు, ఎవరూ పొందని స్వచ్ఛమైన ప్రేమ వుంటాయని అతని అభిప్రాయం. పెండ్లికాగానే ఆ కొత్తదనం నశించి, స్వేచ్ఛ పోగొట్టు కోగానే, స్త్రీప్రపంచంతో అతని స్నేహబంధనాలు నశించాయన్న వొక, వెర్రి నమ్మకాన్ని పరిహసించడానికా నాఅబద్ధం? పెండ్లయి ఏడాదే అయిందనుకోండి. ఏడాదైనా, ఏడు ఘడియలైనా, భార్య వున్నవాడు లేనివాడికింద ఎట్లా లెక్కింపబడతాడు?

అట్లా అబద్ధం చెప్పితే ఆ స్త్రీ సంతోషించి తనతో మరింత స్వేచ్ఛగా మాట్లాడనిస్తుందని భావం కాబోలు!

పైగా, మాజీవితాలలో, మేము ఎన్నడూ కలుసుకోంగదా అన్న ధైర్యం వొకటి. ఆకాసేపు అబద్ధంచెప్పి ఆమెను సంతోష పెట్టడంలో పెద్దపాపం యేమీ కనిపించదు. ప్రవర్తన హృదయం

వల్ల ప్రబోధింప బడింది. మంచిచెడ్డలు, ప్రవర్తన జరిగిపోయిన తరు వాత తాపీగా ఆలోచించే బుద్ధిమీద ఆధారపడింది. అసత్యం చెప్పె నాసరే ఆమెని సంతోషపెట్టమని హృదయంకోరింది; యింద్రియాలు ఆమోదించాయి.

కాని, నాబుద్ధి? ఒప్పుకోదు. నన్ను చాలా బాధపెట్టింది. కమల అమాయకత్వం, ఉత్సాహం తెల్చుకుంటే, నాఅంత చెడ్డవాడు వుంటాడా అనిపించింది. నాలో నేను సమాధాన పడేందుకు చాలా రోజులు పట్టింది. నేనూ, కమలా, యెన్నడూ కలుసుకోం గదా. కలుసుకున్నా యీ సంభాషణంతా మరిచిపోయి వుండొచ్చు. లేక పోతే, తర్వాత వివాహం జరిగిందని చెప్పొచ్చు. యింటికి రాగానే, నామీద నాకు మరింతకోపం రావడం మొదలెట్టింది. నా భార్య కమలకంటె చక్కంది. యెందుకీ లేనిపోని ఆరాటం. నాఉద్దేశ్యం యేదైనా, అబద్ధంచెప్పడం పొరపాటనడానికి నిదర్శనం — నన్నా విషయం కొన్ని నెలలు బాధించడమే. నన్ను యీపాడు నైతిక దృష్టి అల్లా అవస్థపడేటట్లు తరిఫీదుచేసింది. చేసిన నేరంకంటె పడే బాధ ఎన్నోరెట్లు యెక్కువ.

ఏడాది గడిచింది. అది వేసంగి. నేను నిద్రనుంచి లేచేటప్ప టికి నాలుగు దాటింది. నిద్రనుంచి లేవకపోతే లేవకపోను రంగడు "ఎవరో వచ్చారండి" అని లేపాడు.

"ఎవరురా ?"

"ఎవరో ఒకాయన మీరుండారా అంటూ గుమ్మంకాడ నిల బడ్డాడండి."

లోపలికెళ్ళి మొహం కడుక్కొని తువ్వాలుతో తుడుచు కున్నా. ప్లాస్కులో కాఫీ పోసుకు తాగుతున్నాను. రంగడు గుమ్మంలో నిలబడ్డాడు.

"మీరుండారని చెప్పానండి. ఆ వొచ్చినాయన సందు చివర బండికాడికెళ్ళాడండి. అందులోంచి ఓ అమ్మగారు దిగారండి - అంటే

బండిలోంచి అండి - ఆరు తిన్నంగా వచ్చేసి ముంగల గదిలో కూకున్నారండి. ఆ వొచ్చినాయన ఓ బుట్టకూడా తీసుకొచ్చారండి. ఆ బుట్టలో మామిడిపళ్ళండి. మళ్ళా ఆయన తిన్నంగా సందులో బండి కాడికెళ్ళాడండి."

"అమ్మగారేరి ?"

" ముంగలి గదిలో కూకున్నారండి "

" ఛా, మనమ్మగారురా"

" అమ్మగారు గుళ్ళోకెళ్ళారు "

ఆ వొచ్చిందెవరు చెప్మా.! గుండెలు వేగంగా కొట్టుకొంటున్నాయి. ఎంతసేపయింది, ఎక్కడున్నారు అనుకుంటూ లేచి వెళ్ళాను. పీధిగదిలో కూర్చుంది కమల. నరాలన్నృత్యం నిలబెట్టేటందుకు గుప్పిడి బిగించుకున్నాను. తేళ్ళ కుటుంబాన్ని మింగినట్టుగా వుంది నాకంఠం.

కమలకింకా జ్ఞాపకంవుంటే మాట - ఎందుకుండదూ వాళ్ళు మిగతా వన్నీమర్చిపోయి తప్పకుండా జ్ఞాపకం వుంచుకొనేది వొక్కటే - నేఆడిన అబద్ధం బయటపడివుంటుంది. ఎందుకంటే బల్ల మీద మా పెళ్ళిఫొటోవుంది. వాడికీర్తి ప్రపంచమంతా ఎక్కడ వ్యాపించదో' అనే భయంవల్ల కాబోలు ఫొటో తీసినవాడి పేరు, వాడికొట్టుపేరూ, తీసినతారీఖు, నెల, సంవత్సరము పెద్ద పెద్ద అంకెలతో అక్షరాలతో వున్న ఒకఅట్టని ఆఫొటోలోసగం ఆక్రమించేటట్లుగా అడ్డంగా అతికించుకు కూర్చున్నాడు. గోడల్ని మరికొన్ని పటాలున్నాయి.

హిందీఫిలింతారలు, మొదటి కాంగ్రెసు ప్రెసిడెంటు, రవీంద్రనాధ్ టాగూర్ పటాలు, పొట్టి శ్రీరాములు కాలెండర్ బొమ్మ.

" ఎక్కడనుండి రావడం. ఎంతసేపయింది " అన్నాను.

అటూ, యిటూచూసి ప్రైవెనా పత్రికని తేదీ కనపడకుండా ఆపెళ్ళిఫొటో మీద కప్పాలని బల్ల పైనా, క్రిందా సర్దడం మొద లెట్టాను.

" ఈవూళ్ళో మాపెత్తల్లి వుందిగా. తమ్ముడికి పెళ్ళి సంబంధ ముంటే, పిల్లనిచూడాలని వచ్చాం "

' అలాగా '

వీలుగా మరేపత్రికా, కాగితంకనపడలేదు. అయినాయిప్పుడేం చేసినాలాభంలేదు. ఆఫొటోపైన తేదీని గుర్తించి వుంటుందని నేనెందు కనుకోవాలి? ఒకవేళ గుర్తించినా అది ఆఫొటోగ్రాఫర్ కొట్టు అవ తరించిన తేదీగా సమర్థించ కూడదా?

రంగడిని కాఫీతీసుకు రమ్మన్నాను.

' అక్కర్లేదు, యిప్పుడే త్రాగివచ్చా '

' ఫరవాలేదు, కాఫీయెంత - పిల్లనచ్చిందా? '

' వాడికి నచ్చాలిగా '

' మరే. మరే '

' ఇంత తొందరలో కలుసుకుంటామనుకోలేదు ' అనినవ్వింది.

' ఆ, అవును యింత తొందర్లో - మరిభూమి గుండ్రంగా వుంటుందిగా '

' ఈ చీర ఆరోజున కొన్నదే '

' అవునవును, చాలా బాగుంది. ఎల్లాగయినా మీకు చీరల విషయం బాగాతెలుసు 'అన్నాను ఇదివెనక అన్నమాటే.

' నా పేరుమర్చిపోయారా?,

' లేదు, లేదు...కమల '

' మరి మీరూ అనడం ఎందుకు ? '

ఇద్దరం నవ్వుకున్నాం.

పక్కనున్న బుట్టకేసి చూశాను.

' మామిడి పళ్ళా '

'' మామిడి పళ్ళే ''

'' తెచ్చారా ! ''

నవ్వింది.

గోడలకేసి నాలుగుమూలలా చూసింది.

'' ఈ చీరకూడా చాలా బాగుందే - కమలమ్మ యిక్కడ వుందా ?'' అంటూ చిలక్కొయ్యని వున్న ఊదారంగు పట్టుచీర కేసిచూసింది.

ఎంతపని జరగాలో అంతపనీ జరిగింది. చిలక్కొయ్యని నా కోటు పక్క ఆవిడ చీరకూడా తగిలించివుంది. నాకు మా ఆవిడ మీద వొళ్ళు మండింది. ఆ గొప్పచీరని పదిమందీ చూడాలనా. వీధి గదిలో పెట్టడం ? తన చీరలకి ఆ బీరువా, రెండు ట్రంకులూ చాలవూ ! ? తన చక్కదనం చూచుకొంటూ తనవ్యక్తి అలంకర ణలో నిమగ్నురాలైన యిల్లాలు గృహాలంకరణం గురించి పట్టించు కోదని వూరికే అన్నారా పెద్దలు!

'' అదా - అబ్బే - కాదు.''

"అంటే అది చీరకాదంటారా ?''

''అహా - అది కమలమ్మది - కాదన్నమాట"

ఈసారికూడా అబద్ధంచెప్పి లాభంలేదని తెలుసుగున్నాను. ఎట్లాను తెలియకమానదు - ఆ గాయం ఎల్లానూ తగుల్తుంది. గనుక ముందే సిద్ధపడటం మంచిది.

"నీకు తెలియదేమో - ఈ మధ్య..."

"ఎవరేనా కొత్తచుట్టం ?"

నాకు మరింత కోపంవస్తోంది. మాట్లాడుకొనేందుకు ఎన్నో విషయాలుండగా ఆ చీర విషయం వొక్కటే రెట్టించి అడగడం స్త్రీ దృక్పథం ఎంత యిరుకైందో తెలుపుతుంది.

"అబ్బే ఎవ్వరూ లేరు...నా భార్యది" అని ఆమె కేసి చూడకుండా బల్లమీద గుడ్డనిలాగి వేలుకిచుట్టుకుంటున్నా. ఆమెతన ఆశ్చర్యాన్ని ఎల్లా ప్రకటించిందో చూడలేదు.

'నీకు? భార్య....'అంటూ వేలుని నావైపు చూపింది.

" అందులో విశేషం ఏముంది? "

' నాకప్పుడు చెప్పలేదే! లేదనికూడా చెప్పావు. ఎదురుగుండా ఫొటోవుండగా ఆఫొటో చూసి నిజంతెలుసుకొని కూడా ఏమీ తెలియనట్లు నాచేత చెప్పించి తానుపొందిన వినోదంలో ఎంతకసివుందో! ఈ మధ్యనే కాపరానికి వొచ్చిందంటే కొన్ని చిక్కులున్నాయి. ఈ మధ్యనేకాపరానికొచ్చిన భార్య తాలూకు చీరలు వీధిగదుల్లోకి విరబోసుకురావు. నిజంచెప్పదల్చు కొన్నప్పుడు పూర్తిగా చెప్పడం మంచిది.

' అవును '

'ఏం అవును?'

'అయింది. అయింది.'

"ఎందుకు?"

"అందరి మొగాళ్ళలాగే నాకూను."

'అదికాదు. అప్పుడల్లాగ ఎందుకు చెప్పావు?"

'ఏమో తెలీదు. అల్లా చెప్పాలనిపించింది."

' చిత్రంగావుంది.'

'నీకు తెలుసు'

'నాకేం తెలుసూ?'

రంగడు కాఫీ కప్పులు టేబిల్ మీద పెట్టాడు. కమల తాగనంది. "పోనీ మామిడిపళ్ళు కోసిపెట్టనా" అని బుట్టనాకేసి లాగాను. ఆ బుట్టని తనకేసి లాక్కుంది. కిళ్ళీలు పట్టుకురమ్మని రంగడిని పంపించివేశాను. ఆమె లేచి గుమ్మంవేపు కుర్చీలో కూర్చుంది. ఆమెకి కోపం వొచ్చేసింది. అసూయతో మిళితమైన వొకమంట చెలరేగినట్లు కళ్ళు పదేపదే మూస్తోంది. రక్తం ఎరుపుతో ఆమె చెక్కిళ్ళు మెరిశాయి. చెలగాటం సహించని ఆమె కనుబొమ్మలు ముడుచుకొని నుదిటిమీద చర్మాన్ని కిందికి లాగుతున్నాయి. తనని వొక్కదాన్ని చేసి నేను నా భార్య కలసి మోసగించామని అనుకొంటోంది కాబోలు !

"ఆ ఫొటోలో, ఆమే..." అన్నాను.

"తెలుస్తూనే వుంది. నువ్వు నాతో ఆడిన అబద్ధానికి లోపల ఆనందిస్తున్నావనుకుంటా.." ఆ వాక్యంలో ఎంతో వెక్కిరింపు. ఈర్ష్య యిమిడ్చింది; కొన్ని నెలలు బాధపడి వుండటంవల్ల నేను దాని

కంతా సిద్ధపడే వున్నాను. నాటకంలోి పాత్రని చూస్తున్నట్లు చూస్తున్నానా మెను.

"నువ్వట్లా అనుకోకూడదు. ఆ సమయంలో ఏదో అల్లా అనే శాను. నాకెందుకర్థం కాదు ?"

"భలేగా చేశానని లోపల గర్విస్తున్నారనుకుంటా, నువ్వూ మీ ఆవిడాను"

"ఇందులోకి దాన్ని దించకు."

"అబ్బో...భార్య మాటంటే ఎంత పౌరుషం-ఎంత రోషం !"

"అబ్బ, వొద్దు కమలా ! నన్నను. నేను సిద్ధంగా వున్నా. దాన్నివొద్దన్నాను. అంతే, దానికేమీ తెలియదు."

"నాదగ్గరే అబద్ధం ఆడినవాడవు నీ భార్యముందు ఆడకుండా వుంటావేమిటి ? నన్ను చేసిన మోసానికి సంతోషించ నక్కరలేదు. యిల్లా నాలుగబద్ధాలు నేర్పావంటే నిన్నూ యిల్లాగే అబద్ధాలతో మోసంచేస్తుంది"

నా కీవిషయం చాలా బాధకలిగించింది. కమలకి నామీద యింత స్వతంత్రం రావడానికి కారణం నా అబద్ధంకదా ! స్త్రీలకి చనువిస్తే- నే చెప్పక్కర్లేదు అందరికీ అనుభవమే.

"అట్లాంటివనకూడదు. కమలానన్ను క్షమించమంటున్నాను."

కాని, నేను అడకువ. న మ్రత చూపినకొద్దీ కమల కసి మరింత ిక్కువవుతోంది. నేను కొంచెం బింకంగా, పెంకిగా, సమాధానం ెప్తే? "చదువుకున్న వాడవు కుటుంబీకుడవు యిట్లాంటిఅబద్ధాలతో...'

'చాలా శ్రమపడ్డావు. కాఫీ త్రాగు,' అన్నాను ఆమెవాక్యం పూర్తి అవనీకుండా.

ఎందుకో నాహాస్యసృష్టి పరిగెత్తుకుంటూ నా పెదవుల మీద ప్రాలింది. అనవ్వు తుఫానుముందు పిడుగు.

కమల లేచింది. కుర్చీలు అప్ సర్దుతో నేనూ నుంచున్నాను.

"నువ్వే యీపని చేశావని నవ్వొక్కరలేదు. పాపం, నీ కొక్కడికే పెండ్లయిందనుకుంటున్నావు కాబోలు! నాకూ పెండ్ల యింది. నీకు పదాదిక్రితమే అయితే నాకంతకిముందే అయింది. నువ్వు అల్లా ఎందుకు అబద్ధం ఆడావో నేనూ అందుకే ఆడాను! సరా? నాకూవొస్తోందినవ్వు. కాని నీఅంత బిగ్గరగా నవ్వలేనులే..."

నన్నేమీ సమాధానం చెప్పనీయకుండానే వెళ్ళిపోయింది. చేతైనప్పుడు ఏడ్పు, చేతకానప్పుడునవ్వు, అంటూ గొణగడం విన పడింది. నేనూ వెనకాలే బయల్దేరాను. రంగడు కిళ్ళీలు తెచ్చాడు. ఆమెవెళ్ళి బండిలోకెక్కింది. నేను ఆశ్చర్యంతో కదలలేకపోయాను. నాలోబరువు తగ్గింది. నా అసత్యపాపాన్ని పంచుకునేందుకు స్నేహితులున్నారు. నేను అనుకున్నంత చెడ్డవాడిని కాదేమోనని పించింది. అందరూ అంతే ననుకుంటాను. ఇట్లాంటి సత్యం తెలుసు కోడంకోసం అబద్ధం ఆడితేనేం: కమలపై నాకుకోపంలేదు. కోపం

వచ్చిన స్త్రీపై పగసాధించడానికి చాలా అభ్యంతరాలుంటాయి. కాని క్షణ క్షణమూ ఆమె పెద్దదై ముదుసలిగా మారుతోందని వూహించుకొని తృప్తిపడటానికి ఏ ఆటంకమూ వుండదు. వీధి చివరకి చూశాను. మా ఆవిడదూరంగా తలవొంచుకుని గుడినుంచి వొస్తోంది.

రంగడిని మామిడిపళ్ళ బుట్టని బండిలో యిచ్చేసి రమ్మని నేను లోపలికి వచ్చేశా. భార్య తనంతట తాను ఎల్లానూ తెలుసు కుంటుందని నిర్ధారణ అయినప్పుడు, భర్త ఆవిషయం యితరులు చెప్పేముందు భార్యతో తనే చెప్పివెయ్యడం శ్రేయస్కరమేమో!